క్లుప్తంగా

ఇంటింటికీ భగీరథ నీరందించాలి



వెంకటపూర్‌లో పర్యటిస్తున్న అదనపు కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్

ఆసిఫాబాద్‌రూరల్: ఇంటింటికీ భగీరథ నీరందించాలని అదనపు కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ అన్నారు. మండలంలోని వెంకటపూర్, మోవాడ్, బలన్‌పూర్, నాయక్‌గూడ గ్రామాలను గురువారం సందర్శించారు. భగీరథ నీరు వస్తున్నాయా లేదా?గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. జీపీల్లో నర్సరీలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వేసవిలో నీటి సమస్య లేకుండా ప్రజలకు ప్రతి రోజు ఇంటింటికి భగీరథ నీరందించాలన్నారు. కరెంట్ సమస్యతో గ్రామాలకు నీరు వస్తాలేవా అని అధికారులు చెప్పడంతో వెంటనే సమస్య పరిష్కరించాలన్నారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాలను పరిశీలించి పిల్లలు, గర్భిణులకు పౌష్టికాహారం అందించాలన్నారు. భగీరథ ఈఈ వెంకటపతి, ఏఈ శైలేందర్, శ్రీనివాస్, ఎంపీవో ప్రసాద్, సర్పంచ్ బాపురావు, కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.

మోకాళ్లపై కూర్చొని నిరసన



నిరసన తెలుపుతున్న వీవోఏలు

కాగజ్‌నగర్‌టౌన్: పట్టణంలో వీవోఏల సమ్మె కొనసాగుతోంది. ఇందులో భాగంగా గురువారం 11వ రోజు మోకాళ్లపై కూర్చొని నిరసన తెలిపారు. వీరికి సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ముంజం ఆనంద్‌కుమార్ మద్దతు పలికారు.

నేడు పూర్వ విద్యార్థుల సమ్మేళనం

కాగజ్‌నగర్‌టౌన్: పట్టణంలోని బాలభారతి ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని శుక్రవారం నిర్వహిస్తున్నట్లు బాలభారతి ఎడ్యుకేషనల్ సొసైటీ చైర్మన్ ఖాజా వసీమొద్దీన్, సొసైటీ సభ్యులు జి.నాగేశ్వర్ రావు, వినోద్ తెలిపారు. గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. పాఠశాలలో సాయంత్రం 5 గంటలకు నిర్వహించే సమ్మేళనానికి 1963–2023 సంవత్సరంలో చదివిన పూర్వ విద్యార్థులు, వారి కుటుంబ సభ్యులు, ఎడ్యుకేషనల్ సొసైటీ మాజీ సభ్యులు హాజరుకావాలని కోరారు. వివరాలకు 8328429208,9010890500, 9959271400, 9676849421 సెల్‌నంబర్లలో సంప్రదించాలని కోరారు. సొసైటీ సభ్యులు ఈర్ల సునీల్ కుమార్, షేక్ అక్బర్ (తిల్లు భాయ్) ఎండీ ఆఫ్రోజ్ అలీ పాల్గొన్నారు.

29న నారాయణ విగ్రహావిష్కరణ



మాట్లాడుతున్న నాయకులు

కౌటాల: ఈనెల 29న నవేగాంలో మాలీ వ్యవస్థాపక అధ్యక్షుడు దివంగత వడాయి నారాయణ నూతన విగ్రహావిష్కరణ కార్యక్రమం ఉంటుందని మాలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆదే వసంత్‌రావ్ తెలిపారు. మండల కేంద్రంలోని మాలీ సంఘం భవనంలో గురువారం సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. మాలీ సంఘం అభివృద్ధి కోసం నారాయణ కృషి చేశారని తెలిపారు. విగ్రహావిష్కరణ అనంతరం సభ ఉంటుందని, మాలీ సంఘం సమస్యలపై చర్చించనున్నట్లు తెలిపారు. రాష్ట్ర నాయకులు హాజరవుతారని, మాలీ కులస్తులు, నాయకులు, విద్యార్థులు హాజరుకావాలని కోరారు. సమావేశంలో ముత్తంపేట్ సర్పంచ్ ఆదే శ్రీనివాస్, సంఘం ఉపాధ్యక్షులు నాందేవ్, నాయకులు పాల్గొన్నారు.

కార్యవర్గం




కుర్సెంగ సోంజి పెందోర్ శ్రీనివాస్

కెరమెరి: సాకడ గ్రామంలో గురువారం వీటీడీఏ(విలేజ్ ట్రైబల్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ) కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికల ప్రత్యేకాధికారి రాథోడ్ బలిరాం ఆధ్వర్యంలో జరిగింది. అధ్యక్షుడిగా గ్రామ సర్పంచ్ సుమిత్రబాయి ఉండగా, ఉపాధ్యక్షుడిగా కుర్సెంగ సోంజి, కార్యదర్శిగా పెందోర్ శ్రీనివాస్, సభ్యులుగా కె.భీంబాయి, జనాబాయి, పి.ఆనంద్‌రావు, కనక శంకర్, పెందోర్ దంబిరావును ఎన్నుకున్నారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ పెందోర్ ఆనంద్‌రావు, కార్యదర్శి గణేశ్ ఉన్నారు.

బీటీ పనులు ప్రారంభమెప్పుడో?

- రూ.3.96 కోట్లతో నాలుగు బీటీరోడ్లు మంజూరు
- రెండు రోడ్లకు మాత్రమే టెండర్ల ప్రక్రియ పూర్తి



బీటీ మంజూరైన రాంపూర్ రోడ్డు

రెబ్బెన: రాష్ట్రప్రభుత్వం మారుమూల గ్రామాలకు బీటీ రోడ్లు మంజూరు చేసి నెలలు గడుస్తున్నా పనుల ప్రారంభానికి మోక్షం కలగడం లేదు. మరో నెలన్నర రోజుల్లో వర్షాలు ప్రారంభం కానుండటంతో గ్రామాల ప్రజలకు ఈసారి మట్టిరోడ్లతో అవస్థలు తప్పేలా కనిపించడం లేదు. నెలలు గడుస్తున్నా పనులకు సంబంధించి ఎలాంటి కదలికలు లేకపోవడంతో ప్రజలు నిరాశ చెందుతున్నారు. ఏళ్లుగా బీటీ కోసం ఎంతో ఆశగా ఎదురుచూస్తున్న ప్రజలకు సకాలంలో పనులు ప్రారంభం కాకపోవడంతో నిరాశకు గురవుతున్నారు.

నాలుగు గ్రామాలకు రోడ్లు

రాష్ట్ర ప్రభుత్వం గిరిజన సంక్షేమ శాఖ ద్వారా గిరిజన ఆవాస ప్రాంతాలకు మెరుగైన రోడ్డు సౌకర్యానికి భారీగా నిధులు కేటాయించింది. తొలివిడుతలో మండలానికి రూ. 3.96 కోట్లతో నాలుగు గ్రామాలకు బీటీ రోడ్లు మంజూరు చేసింది. పులికుంట పంచాయతీ పరిధిలోని కొత్తపులికుంటకు తక్కళ్లపల్లి రైల్వే గేట్ సమీపంలోని ఆర్అండ్‌బీ రోడ్డు నుంచి కొత్తపులికుంట వరకు 2 కి.మీ బీటీ నిర్మాణానికి రూ.1.16 కోట్లు, నారాయణపూర్ పంచాయతీ పరిధిలోని పైకాజీగూడ కోసం ప్రధాన పీడబ్ల్యూడీ రోడ్డు నుంచి పైకాజీగూడ వరకు 1.5 కి.మీ వరకు రూ. 1.05 కోట్లు, నూతన పంచాయతీగా ఏర్పడిన రాంపూర్‌కు పీడబ్ల్యూడీ రోడ్డు నుంచి రాంపూర్ వరకు 2 కి.మీ వరకు రూ.1.40 కోట్లు, రోళ్లపాడులో ఆర్అండ్‌బీ రోడ్డు నుంచి రొళ్లపాడు గ్రామానికి 1.2 కి.మీ బీటీకి రూ. 35 లక్షలు మంజూరు చేసింది.

రెండు రోడ్లకే టెండర్లు పూర్తి

మండలానికి ఎస్టీ నిధులతో నాలుగు రోడ్లు మంజూరు కాగా కేవలం వివిధ కారణాలతో కేవలం రెండు రోడ్లకు మాత్రమే టెండర్లు పూర్తయినట్లు సమాచారం. రాంపూర్, పైకాజీగూడ గ్రామాలకు మంజూరైన రోడ్లకు సంబంధించి టెండర్లు పూర్తి కాగా, ప్రస్తుతం పనులకు సంబంధించి అగ్రిమెంట్ల ప్రక్రియ దశలో ఉన్నాయి. అయితే కొత్తపులికుంటకు మంజూరైన రోడ్డు నిర్మాణం కోసం టెండర్లు పిలవగా కాంట్రాక్టర్ ముందుకు రాలేదు. అదే తరహాలో రోళ్లపాడు రోడ్డు అంచనా విలువ రూ.35లక్షలు ఉండటంతో టెండర్లు పిలవాల్సి ఉంది. ఈ లెక్కన కొత్త పులికుంట, రోళ్లపాడు రోడ్లు ఇప్పట్లో ప్రారంభమయ్యేలా కనిపించడం లేదు. మిగిలిన రెండు రోడ్లకు సంబంధించిన అగ్రిమెంట్ల ప్రక్రియ పూర్తి కాగానే పనులు చేపట్టనున్నట్లు అధికారులు చెబుతున్నారు. ఈలెక్కన మే రెండో వారం లేదా మూడో వారంలో రాంపూర్, పైకాజీగూడ గ్రామాలకు చెందిన రోడ్ల పనులు ప్రారంభమయ్యేలా కనిపిస్తున్నాయి.

వర్షాకాలంలో తిప్పలు

బీటీ రోడ్లు మంజూరైన గ్రామాల ప్రజలకు ఈసారి వర్షాకాలం తిప్పలు తప్పేలా కనిపించడం లేదు. అగ్రిమెంట్ల దశలో ఉన్న రోడ్లకు సంబంధించిన ఈ ప్రక్రియ పూర్తయ్యేందుకు కనీసం 15 రోజుల సమయం పట్టే అవకాశం ఉంది. అప్పటిలోగా రోడ్లు నిర్మాణానికి కావల్సిన మెటిరియల్స్‌ను అందుబాటులో పెట్టుకున్నా జూన్ రెండో వారం నుంచే వర్షాలు ప్రారంభం కానున్నాయి. దాంతో వర్షాలతో రోడ్డు పనులకు తీవ్ర అటంకం ఏర్పడనుంది. గతంలో మాదిరిగానే ఈసారి పైకాజీగూడ, రాంపూర్ గ్రామాల ప్రజలకు వర్షాకాలంలో బురద రోడ్లపై రాకపోకలు సాగించాల్సి ఉంది.

అగ్రిమెంట్ దశలో ఉన్నాయి

రెండు రోడ్లకు టెండర్లు పూర్తయి ప్రస్తుతం అగ్రిమెంట్ దశలో ఉన్నాయి. రాంపూర్, పైకాజీగూడ రోడ్లకు టెండర్లు పూర్తయింది. కొత్తపులికుంట రోడ్డు కోసం టెండర్ పిలిస్తే ఎవరూ ముందుకు రాలేదు. పైకాజీగూడ రోడ్డు కోసం టెండర్ పిలవాల్సి ఉంది. టెండర్లు పూర్తయిన రోడ్లను మే రెండో వారం వరకు పనులు ప్రారంభమయ్యేలా చూస్తాం.
– బద్రుద్దీన్, ఏఈ

భరోసా సభను విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న నాయకుడు అర్షద్ హుస్సేన్

కౌటాల: హైదరాబాద్‌లో ఈనెల 7న జరిగే తెలంగాణ భరోసా సభను విజయవంతం చేయాలని బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి అర్షద్ హుస్సేన్ కోరారు. మండల కేంద్రంలో పార్టీ మండల నాయకులతో గురువారం ఆయన మాట్లాడారు. బీఎస్పీతోనే బహుజనుల అభివృద్ధి సాధ్యమని తెలిపారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ అధ్యక్షతన నిర్వహించే సభకు పార్టీ జాతీయ అధ్యక్షురాలు మాయావతి హాజరవుతారని తెలిపారు. నియోజకవర్గంలోని బహుజనులందరు సభకు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు. నియోజకవర్గ అధ్యక్షుడు కొండ రాంప్రసాద్, జిల్లా నాయకులు రాంటెంకి నవీన్, సంజీవ్, భరత్, మోతిరాం, రజనికాంత్, దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

కంటి వెలుగు ప్రారంభం



ప్రారంభిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

చింతలమానెపల్లి: మండల కేంద్రంలో గురువారం కంటి వెలుగు కార్యక్రమాన్ని ఎంపీపీ డుబ్బుల నానయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎంపీడీవో మహేందర్, మండల కోఆప్షన్ సభ్యుడు నాజీం, నాయకులు డుబ్బుల వెంకన్న, నీలగౌడ్, శ్రీనివాస్, సురేష్, వైద్యాధికారి రాజ్‌కుమార్, కార్యదర్శి ఆసిఫ్ అలీ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పంట నష్టంపై సర్వే



ఎల్కపల్లిలో సర్వే చేస్తున్న ఏఈవో అంజన్న

పెంచికల్‌పేట్: గ్రామాల్లో వడగళ్ల వానతో నష్టపోయిన వరి పంటలను ఏవో రాజులనాయుడు, ఏఈవోలు అంజన్న, శ్రీవిద్య, లావణ్య గురువారం పరిశీలించారు. ఆయాచోట్ల పంటనష్టంపై సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాల నష్టపోయిన రైతుల వివరాలు నమోదు చేసుకున్నట్లు తెలిపారు. వీరి వివరాలను ఉన్నతాధికారులకు నివేదిస్తామన్నారు.

తాగునీటికి ప్రయాణికుల తండ్లాట



కౌటాలలోని ఆర్టీసీ బస్టాండ్

- కౌటాల బస్టాండ్‌లో తాగునీటి సౌకర్యం కరువు
- వాటర్ ప్యాకెట్లు కొనుగోలు చేస్తున్న ప్రయాణికులు
- కూల్ వాటర్ ఫ్రిడ్జి ఏర్పాటు చేయాలని డిమాండ్

కౌటాల: 'ఆర్టీసీ బస్సుల్లోనే ప్రయాణించండి.. ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం సురక్షితం' అంటూ ప్రకటనలు జారీ చేసే తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ అధికారులు ప్రయాణికులకు కావాల్సిన కనీస సౌకర్యాలను మాత్రం పట్టించుకోవడం లేదు. కౌటాల ఆర్టీసీ బస్టాండ్‌లో తాగునీటి సౌకర్యం లేక ప్రయాణికులు అనేక ఇబ్బందులు పడుతున్నారు.

సౌకర్యాలు కరువు

మండల కేంద్రంలోని ఆర్టీసీ ప్రయాణ ప్రాంగణం మండల వాసులతోపాటు ప్రయాణికులతో ఎప్పుడు రద్దీగా ఉంటుంది. బస్టాండ్‌కు ప్రతీరోజు ఎన్నో ఆర్టీసీ బస్సులు రాకపోకలు సాగిస్తుంటాయి. కానీ బస్టాండ్‌లో ప్రయాణికులకు కనీస సౌకర్యాలు కరువయ్యాయి. ఓవైపు ఎండలు మండుతుండడంతో తాగునీటి కోసం బస్టాండ్‌కు చేరుకున్న ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. ఆర్టీసీ బస్టాండ్‌లో తాగునీటి వసతి లేకపోవడంతో దాహం తీర్చుకోవడానికి డబ్బులు చెల్లించి స్థానిక కిరాణా షాపుల్లో వాటర్ బాటిల్లు, వాటర్ ప్యాకెట్లు కొనుగోలు చేస్తున్నారు. మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ కౌటాల, చింతలమానెపల్లి, బెజ్జూర్ మండలాలకు ప్రధాన ప్రయాణ ప్రాంగణంగా ఉంది. దీంతో బస్టాండ్‌కు నిత్యం ఎంతో మంది ప్రజలు, ప్రయాణికులు వస్తుంటారు. ఆర్టీసీ బస్టాండ్‌లో తాగునీటి వసతి కల్పించాలని పలుమార్లు అధికారులకు విన్నవించినా ఎవరూ పట్టించుకోవడం లేదని ప్రయాణికులు వాపోతున్నారు.

ఇబ్బందుల్లో ప్రయాణికులు

మండల కేంద్రంలోని పలు ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలకు ప్రతీరోజు వందలాది మంది జనం వస్తుంటారు. అలాగే విద్యా సంవత్సరంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల, జూనియర్ కళాశాలకు కూడా విద్యార్థులు వస్తుంటారు. వీరంతా తిరుగు ప్రయాణంలో కౌటాల ఆర్టీసీ బస్టాండ్‌లో బస్సు కోసం వేచి చూస్తుంటారు. బస్టాండ్‌లో తాగునీటి వసతి లేకపోవడంతో విద్యార్థులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత ఆర్టీసీ ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి బస్టాండ్‌లో కూల్ వాటర్ ఫ్రిడ్జి ఏర్పాటు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

చల్లని నీరందించాలి

ఆర్టీసీ అధికారులు బస్టాండ్‌లో కూల్ వాటర్ ఫ్రిడ్జి ఏర్పాటు చేసి చల్లని నీరు అందించాలి. కౌటాల నుంచి ఇతర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు తాగు నీటి కోసం తంటాలు పడుతున్నారు. మండుతున్న ఎండలను దృష్టిలో ఉంచుకొని బస్టాండ్‌లో తాగునీటి సౌకర్యం కల్పించాలి.
– ప్రవీణ్, ముత్తంపేట్

వాటర్ ప్యాకెట్లు కొంటున్నాం

బస్టాండ్‌లో తాగునీరు లేక డబ్బులు చెల్లించి వాటర్ బాటిళ్లు, వాటర్ ప్యాకెట్లు కొనుగోలు చేస్తున్నాం. స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌కు వెళ్లినప్పుడు తాగునీటి వసతి లేక ప్రజలు, విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి కౌటాల ప్రయాణ ప్రాంగణంలో తాగునీటి సౌకర్యం కల్పించాలి.
– రమేశ్, ప్రయాణికుడు

ఇంధన కథ కంచికేనా?

- నెలరోజులుగా బంక్ బంద్
- అనేకమార్లు నో స్టాక్ బోర్డులు
- జైనూర్, తిర్యాణిలో అదే పరిస్థితి
- ఇబ్బంది పడుతున్న వినియోగదారులు



వెలవెలబోతున్న కెరమెరి బంక్



నోస్టాక్ అని అతికించిన బోర్డు

కెరమెరి: నెల రోజులుగా డీజిల్, పెట్రోల్‌బంక్ బంద్ ఉండడంపై ప్రజలు భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు. ఇక ఇంధన కథ కంచికేనా? అని చర్చించుకుంటున్నారు. పెట్రోల్ బంక్ ఏర్పాటైందని సంతోషపడ్డ మండల వాసులకు ఆదిలోని హింసాపాదులా మారింది. అధికారుల నిర్లక్ష్యం వినియోగదారులకు శాపమైంది. తరచూ పెట్రోల్, డీజిల్ అయిపోవడంతో వినియోగదారులు ఇబ్బంది పడుతున్నారు. ఒక్క కెరమెరిలోనే కాదు, జైనూర్, తిర్యాణిలో జీసీసీ ఆధ్వర్యంలో ప్రారంభించిన బంక్‌ల పరిస్థితి ఇలాగే ఉంది. ఐటీడీఏ, జీసీసీ సంయుక్తంగా బంక్ నిర్వహిస్తున్నారు. కాని నిర్వహణపై నీలినీడలు అలుముకున్నాయి. దీంతో వినియోగదారులకు ఇబ్బంది తప్పడం లేదు. నెల పదిహేను రోజులుగా బంక్‌లు మూసిఉండడంతో అధికారుల తీరుపై వినియోగదారులు మండిపడుతున్నారు.

లక్షల్లో కలెక్షన్..

2019లో కెరమెరి మండలంలోని సల్తాన్‌గూడలో, 2020లో జైనూర్, తిర్యాణిలో ఐటీడీఏ, జీసీసీ సంయుక్తంగా పెట్రోల్ పెంపులు ప్రారంభించాయి. ప్రారంభంలో నడిచిన బంక్‌లు ఆ తర్వాత కష్టాలు ప్రారంభమయ్యాయి. ప్రతీనెల కనీసం ఐదారు సార్లు డీజిల్, పెట్రోల్ స్టాక్ అయిపోవడంతో వినియోగదారులు ఇబ్బంది పడుతున్నారు. అయితే ఈసారి నెల పక్షం రోజుల నుంచి ఆయా మండలాల్లో బంక్‌లు మూసి ఉండడంతో ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. ప్రతిరోజు కలెక్షన్ రూ.3 నుంచి 4 లక్షల వరకు వస్తుంది. అయినా అధికారులు నిర్వహణలో నిర్లక్ష్యం చేస్తున్నారని వాపోతున్నారు. జైనూర్‌లో మరో పెట్రోల్ బంక్ ఉండడంతో వినియోగదారులు అక్కడి నుంచి సేకరించి అవసరాలను తీర్చుకుంటున్నారు. కెరమెరిలో పెట్రోల్, డీజిల్ అయిపోతే 30 కి.మీ దూరంలో ఆసిఫాబాద్ లేదా 20 కి.మీ దూరంలో జైనూర్, తిర్యాణిలో అయిపోతే 20 కి.మీ దూరంలోని తాండూరుకు వెళ్లాల్సిన పరిస్థితి. ఇప్పటికైనా సంబంధితశాఖ అధికారులు పట్టించుకుని బంక్‌ల్లో ఇంధనం ఉండేలా చర్యలు తీసుకోవాలని పలువురు వినియోగదారులు కోరుతున్నారు.

త్వరగా ప్రారంభించాలి



కెరమెరిలోని పెట్రోల్ బంక్ త్వరగా ప్రారంభించాలి. కెరమెరిలో బంక్ ఏర్పాటు కాగానే ఎంతో సంతోషపడిన ప్పటికి అధిక రోజులు పెట్రోల్, డీజిల్ లేకపోవడంతో మూతపడే ఉంటుంది. దీంతో ఇంధన కావాలంటే ఆసిఫాబాద్, జైనూర్ వెళ్లాల్సింది. ఐటీడీఏ, జీసీసీ అధికారులు స్పందించి తక్షణమే బంక్‌లు ప్రారంభించాలి.
– దుందేరావు, చౌపన్‌గూడ

టీడీఎస్ వస్తే ప్రారంభిస్తాం



రూ.40 లక్షలు వరకు టీడీఎస్(ట్యాక్స్ డిడెక్షన్ సర్వీసెస్) రావల్సి ఉన్నాయి. అవి అందితే ఇబ్బంది ఉండదు. ఆర్థిక ఇబ్బందులతో అనుకున్న స్థాయిలో పెట్రోల్, డీజిల్ తెప్పించలేక పోతున్నాం. ప్రతిసారి రూ.26 లక్షలకు వెచ్చిస్తే వారానికి సరిపడే ఇంధనం వస్తుంది. కాని రూ.13 లక్షలు మాత్రమే చెల్లిస్తున్నాం.
– పాపారావు, జీసీసీ మేనేజర్, ఆసిఫాబాద్

వర్మీ కంపోస్టు తయారు చేయాలి



పరిశీలిస్తున్న డీఎల్‌పీవో సురేష్‌బాబు

కౌటాల: గ్రామ పంచాయతీల్లోని సెగ్రిగేషన్ షెడ్లల్లో వర్మీ కంపోస్టును తయారు చేయాలని కాగజ్‌నగర్ డీఎల్‌పీవో సురేష్‌బాబు అన్నారు. మండలంలోని ముత్తంపేట్ గ్రామంలో గురువారం ఆయన పర్యటించారు. గ్రామశివారులో కొనసాగుతున్న ఉపాధి హామీ పనులు, పారిశుధ్య పనులు, వర్మీ కంపోస్టు తయారీ పనులను ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తడిపొడి చెత్తను వేరు చేసి వర్మీ కంపోస్టు తయారీ చేయాలని, ప్రకృతి వనాల్లో మొక్కలకు వేయాలన్నారు. రైతులకు విక్రయించి ఆదాయం పొందాలన్నారు. కూలీలకు పని ప్రదేశాల్లో వసతులు కల్పించాలని, ప్రతి కూలీకి వందరోజుల పనిదినాలు కల్పించాలని తెలిపారు. ఎంపీవో మౌనిక, సర్పంచ్ ఆదే శ్రీనివాస్, ఉప సర్పంచ్ దుర్గం వెంకటేశ్, కార్యదర్శి ఎస్.సాయికృష్ణ, తదితరులు ఉన్నారు.

'కేసును పక్కదోవ పట్టించొద్దు'

బోథ్: మండలంలోని కౌఠ గ్రామంలో ఇటీవల ఆత్మహత్యకు పాల్పడిన దీటి రాజుకు సంబంధించిన కేసును పోలీసులు పక్కదోవ పట్టించొద్దని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కుదాల స్వామి అన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ.. కౌఠ గ్రామస్తుడు ఊషన్నకు చెందిన ఎద్దులను రాజు దొంగిలించాడని పోలీసులు పేర్కొనడం కేసును తప్పుదోవ పట్టించడమేనని అన్నారు. ఎద్దులను దొంగిలించినందుకే రాజు ఆత్మహత్యకు పాల్పడినట్లుగా పోలీసులు విచారణ చేయడం సరికాదన్నారు. ఊషన్న తన ఎద్దులు దొంగలించబడలేదని ఎస్సై రవీందర్‌కు గురువారం రాత పూర్వకంగా అందజేశారు. ఎద్దులు ఇంటి వద్దనే ఉన్నాయన్నారు. రాజు ఆత్మహత్యకు కారణమైన వారిని కఠినంగా శిక్షించాలని అన్నారు. కేసు విషయమై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లడం జరిగిందని ఎస్సై తెలిపారు.

కోర్టు భవనం నిర్మాణం చేపట్టాలి

బోథ్‌లో కోర్టు భవన నిర్మాణాన్ని చేపట్టాలని ఆర్ అండ్ బీ రాష్ట్ర అధికారిణి వరమ్మాను బోథ్ బార్ అసోసియేషన్ కార్యదర్శి పంద్రం శంకర్ గురువారం కలిసి విన్నవించారు. ఆమె సానుకూలంగా స్పందించినట్లు ఆయన తెలిపారు.

నీటి కోసం రోడ్డెక్కిన మహిళలు



ఖాళీ బిందెలతో నిరసన తెలుపుతున్న కాలనీ మహిళలు

రెబ్బెన(ఆసిఫాబాద్): మండలంలోని గంగాపూర్‌లోని ఓ కాలనీలో తాగునీటి కోసం మహిళలు రోడ్డెక్కారు. పంచాయతీ కార్యాలయం ఎదుట ఖాళీ బిందెలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత కొన్నిరోజులుగా నీటి సరఫరా కాకపోవడంతో ఇబ్బంది పడుతున్నామన్నారు. ఎంపీడీవో, పంచాయతీ కార్యదర్శులు కూడా పట్టించుకోవడం లేదన్నారు. కాలనీ అంతా ఒకే ఒక్క చేతిపంపుపై ఆధారపడాల్సి వస్తోందన్నారు.. ఆ చేతిపంపు సరిగా పనిచేయకపోవడంతో అవస్థలు పడుతున్నామని అన్నారు. కాగా, నిరసన నుంచి సర్పంచ్ పందిర్ల వినోద ఇంటికి వెళ్లి చర్చించారు. భగీరథ అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

ముగిసిన సప్తాహం

ఆదిలాబాద్‌రూరల్: మండలంలోని మామిడిగూడలో ఏడు రోజులుగా కొనసాగుతున్న గురు పారాయణ సప్తాహ కార్యక్రమం గురువారం ముగిసింది. బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాయల్ శంకర్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. భక్తి మార్గమే అందరికీ ముక్తిని ప్రసాదించే మార్గమన్నారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండి భక్తి మార్గంలో పయణించాలన్నారు. చదువుతోనే సమాజంలో గుర్తింపు లభిస్తుందన్నారు. కార్యక్రమంలో గ్రామపటేల్ తుల సీరాం, సర్పంచ్ ఆత్రం యాదవ్‌రావ్, బీజేపీ నాయకులు సునంద, జ్యోతిరెడ్డి పాల్గొన్నారు.

మహాసభ పోస్టర్ ఆవిష్కరణ

ఆసిఫాబాద్‌రూరల్: గుడిహత్నూర్‌తో ఈనెల 29, 30వ తేదీల్లో నిర్వహించే గిరిజన మహాసభకు గిరిజనులు అధికసంఖ్యలో తరలిరావాలని ఆదివాసీ సేన మండల అధ్యక్షుడు కైలాస్ కోరారు. మండలంలోని వట్టివాగు కాలనీలో మహాసభ పోస్టర్‌ను గురువారం ఆవిష్కరించారు. సంఘం నాయకులు సాయి, శ్యామ్‌రావు, జంగు, రమేశ్, భీంబాయి తదితరులు ఉన్నారు.

29న మండల సర్వసభ్య సమావేశం

కెరమెరి: ఎంపీడీవో కార్యాలయంలో ఈనెల 29న ఉదయం 11:30 గంటలకు మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో సత్యనారాయణగౌడ్ ఓ ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ పెందోర్ మోతిరాం అధ్యక్షతన జరిగే సమావేశంలో జెడ్పీటీసీ, ఎంపీటీసీలు, సర్పంచులు, శాఖల అధికారులు నివేదికలతో హాజరుకావాలని పేర్కొన్నారు.